సిరీస్ మనదే

ఆదివారం ఆఖరి పోరు

నాలుగో టీ20లో భారత్ జయభేరి • 3-1తో కప్పు కైవసం • మెరిసిన రింకూ, అక్షర్

యువ భారత జట్టు అదరగొట్టింది! వచ్చే ఏడాది అమెరికా, వెస్టిండీస్ వేదికగా టీ20 ప్రపంచకప్ జరగనుండగా.. ఈ ఫార్మాట్‌లోనూ తాము కప్పుకు పోటీదారులమే అని చాటిచెప్పింది!

వన్డే వరల్డ్ చాంపియన్ ఆస్ట్రేలియాపై సూర్యకుమార్ సారథ్యంలోని యంగ్‌ఇండియా టీ20 సిరీస్ కైవసం చేసుకుంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో పరుగుల వరద పారగా.. ఈ సారి అందుకు భిన్నంగా బౌలర్ల హవా సాగింది!

బ్యాటింగ్‌కు కష్టతరంగా ఉన్న పిచ్‌పై మొదట రింకూసింగ్, యశస్వి, జితేశ్ రాణించి జట్టుకు పోరాడే స్కోరు అందించగా.. బౌలింగ్‌లో అక్షర్, రవి రాణించి కంగారూలను కట్టడి చేశారు. దీంతో సిరీస్ కైవసం చేసుకున్న యువభారత్.. ఇక ఆదివారం నామమాత్రమైన చివరి టీ20 బరిలో దిగనుంది!

రాయ్‌పూర్: యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు సత్తాచాటింది. ఇటీవల వన్డే ప్రపంచకప్ నెగ్గిన ఆస్ట్రేలియాపై మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ కైవసం చేసుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా.. శుక్రవారం జరిగిన పోరులో యంగ్‌ఇండియా 20 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. తద్వారా 5 మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. నయా ఫినిషర్ రింకూ సింగ్ (29 బంతుల్లో 46; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా.. వికెట్ కీపర్ జితేశ్ శర్మ (19 బంతుల్లో 35; ఒక ఫోర్, 3 సిక్సర్లు), యశస్విజైస్వాల్ (37; 6 ఫోర్లు, ఒక సిక్సర్), రుతురాజ్ గైక్వాడ్ (32; 3 ఫోర్లు, ఒక సిక్సర్) తలాకొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1)తో పాటు తొలి మూడు మ్యాచ్‌లకు దూరమైన శ్రేయస్ అయ్యర్ (8) పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఈ మ్యాచ్ కోసం భారత జట్టు ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్‌ను పక్కన పెట్టగా.. వారి స్థానాల్లో జితేశ్ శర్మ, శ్రేయస్ అయ్యర్, దీపక్ చాహర్, ముఖేశ్ కుమార్ బరిలోకి దిగారు. మరోవైపు ఆస్ట్రేలియా కూడా ఐదు మార్పులతో బరిలోకి దిగింది. వన్డే ప్రపంచకప్‌లో ఆడిన జట్టులో ట్రావిస్ హెడ్ ఒక్కడే ఈ మ్యాచ్‌లో ఆడాడు. ఆసీస్ బౌలర్లలో బెన్ డ్వార్షే 3, బెహ్రాన్‌డార్ఫ్, తన్వీర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 154 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ మాథ్యూ వేడ్ (36 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) అత్యధిక స్కోరర్ కాగా.. హెడ్ (16 బంతుల్లో 31; 5 ఫోర్లు, ఒక సిక్సర్) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 3, దీపక్ చాహర్ రెండు వికెట్లు పడగొట్టాడు. అక్షర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన ఆఖరి పోరు ఆదివారం బెంగళూరులో జరగనుంది.

రింకూసింగ్ (46)

నయా ఫినిషర్..

భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ జట్టుకు దూరమైనప్పటి నుంచి భారత జట్టు ఫినిషర్ కోసం ఎదురుచూస్తుండగా.. ఇప్పుడు రింకూసింగ్ రూపంలో ఆ లోటు తీరినట్లు కనిపిస్తున్నది. హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, దినేశ్ కార్తీక్ వంటి వాళ్లను ప్రయత్నించినా.. వారెవరూ ఎక్కువ కాలం ఆ స్థానంలో కొనసాగలేకపోయారు. హార్దిక్, సూర్యకుమార్ ఇన్నింగ్స్ నిర్మించే బాధ్యత భుజానెత్తుకోగా.. ఇప్పుడు రింకూ రూపంలో టీమ్‌ఇండియాకు ప్రత్యామ్నాయ ఫినిషర్ లభించాడు. ఐపీఎల్లో కోల్‌కతా తరపున చివరి ఐదు బంతులకు ఐదు సిక్సర్లు బాది వెలుగులోకి వచ్చిన రింకూ.. అప్పటి నుంచి అదే బాదుడు కొనసాగిస్తున్నాడు. ఛేదనలో చివరి ఓవర్లలో క్రీజులోకి వచ్చి ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తిస్తున్న ఈ గడుసు పిండం.. మొదట బ్యాటింగ్ చేయాల్సి వచ్చినప్పుడు కూడా అదే దూకుడుతో బౌలర్ల లయ దెబ్బతీస్తున్నాడు. తాజా మ్యాచ్‌లో సీనియర్ ప్లేయర్లు సూర్యకుమార్, శ్రేయస విఫలమైన సమయంలో క్రీజులోకి అడుగుపెట్టిన రింకూ సింగ్ ఎలాంటి తడబాటు లేకుండా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు.

తలా కొన్ని..

ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారీ స్కోర్లు చేసిన టీమ్‌ఇండియా ఈసారి ఆ పని చేయలేకపోయింది. పిచ్ బౌలర్లకు అనుకూలిస్తుండటంతో పరుగుల రాక గగనమైంది. కుదురుకునేందుకు కాస్త సమయం తీసుకున్న ఓపెనర్లు యశస్వి, రుతురాజ్ ఆ తర్వాత భారీ షాట్లతో చెలరేగారు. ఫలితంగా ఆరు ఓవర్లలో భారత్ 50 పరుగుల మార్క్ దాటింది. ఆ తర్వాత యశస్వితో పాటు శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ వెంట వెంటనే ఔట్ కావడంతో 63 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డట్లు కనిపించింది. ఈ దశలో రింకూసింగ్ కంగారూ బౌలర్లకు ఎదురునిలిచాడు. ఎడాపెడా బౌండ్రీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ సిరీస్‌లో తొలి సారి తుది జట్టులో చోటు దక్కించుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో భారత్ మరింత భారీ స్కోరు చేసేలా కనిపించినా.. ఆసీస్ బౌలర్లు చివర్లో కట్టుదిట్టమైన బంతులతో ఆకట్టుకున్నారు.

స్పిన్నర్ల ముప్పేట దాడి..

ఓ మాదిరి లక్ష్యఛేదనలో ఆసీస్‌కు హెడ్ మెరుపు ఆరంభాన్నిచ్చాడు. దాదాపు రెండొందల స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు రాబట్టి భారత్‌కు హెచ్చరికలు పంపాడు. అయితే స్పిన్నర్ల రంగ ప్రవేశంతో కంగారూల ఇన్నింగ్స్ కకావికలమైంది. అక్షర్ మూడు వికెట్లతో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించగా.. మరో స్పిన్నర్ రవి బిష్ణోయ్ తన కోటా నాలుగు ఓవర్లలో కేవలం 17 పరుగులే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. గత మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ దంచుడుతో కొండంత స్కోరును చేజ్ చేసిన ఆసీస్ ఈ సారి అనుభవరాహిత్యంతో ఆ పని చేయలేకపోయింది. వేడ్ చివరి వరకు క్రీజులో నిలిచినా.. అతడికి మరో ఎండ్ నుంచి సరైన సహకారం లభించలేదు. మన బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టి మ్యాచ్‌పై పట్టు కొనసాగించారు.

అక్షర్ (3/16)

స్కోరుబోర్డు

భారత్: యశస్వి(సి) మెక్‌డెర్మట్(బి) హార్డీ 37, రుతురాజ్(సి)డ్వారుష్(బి)తన్వీర్ 32, శ్రేయాస్ అయ్యర్(సి) గ్రీన్(బి)సంగా 8, సూర్యకుమార్(సి)వేడ్(బి)డ్వారుష్ 1, రింకూసింగ్(ఎల్బీ) బెహెన్‌డార్ఫ్ 46, జితేశ్‌శర్మ(సి) హెడ్(బి)డ్వారుష్ 35, అక్షర్‌పటేల్(సి)సంగా(బి) డ్వారుష్ 0, దీపక్ చాహర్(సి)గ్రీన్(బి)బెహెన్‌డార్ఫ్ 0, రవి బిష్ణోయ్(రనౌట్) 4, అవేశ్‌ఖాన్ 1 నాటౌట్, ఎక్స్‌ట్రాలు: 10, మొత్తం: 20 ఓవర్లలో 174/9, బౌలింగ్: హార్డీ 3-1-20-1, బెహెన్‌డార్ఫ్ 4-0-32-2, డ్వారుష్ 4-0-40-3, గ్రీన్ 4-0-36-0, సంగా 4-0-30-2, షార్ట్ 1-0-10-0.

ఆస్ట్రేలియా: హెడ్(సి)ముకేశ్(బి)అక్షర్ 31, ఫిలిప్(బి) బిష్ణోయ్ 8, మెక్‌డెర్మెట్ (బి) అక్షర్ 19, హార్డీ (బి) అక్షర్ 8, డేవిడ్(సి)జైస్వాల్(బి)చాహర్ 19, షార్ట్(సి) జైస్వాల్(బి) చాహర్ 22, వేడ్ 36 నాటౌట్, డ్వారుష్(బి) అవేశ్ 1, గ్రీన్ 2 నాటౌట్, ఎక్స్‌ట్రాలు: 8, మొత్తం: 20 ఓవర్లలో 154/7, బౌలింగ్: దీపక్ చాహర్ 4-0-44-2, ముకేశ్ 4-0-42-0, బిష్ణోయ్ 4-0-17-1, అక్షర్ పటేల్ 4-0-16-3, అవేశ్‌ఖాన్ 4-0-33-1.

కరెంటు బిల్లు కట్టక.. జనరేటర్లతో ఫ్లడ్‌లైట్లు!

ఈ మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ స్టేడియంలో ఫ్లడ్‌లైట్లను జనరేటర్ల సాయంతో వెలిగించారు. అదేంటి అనుకుంటున్నారా..! 2010లో ఈ మైదానాన్ని నిర్మించగా.. అప్పటి నుంచి దీనికి సంబంధించిన విద్యుత్ బిల్లు చెల్లించలేదు. దీంతో అది కాస్తా పెరిగి రూ.3.16 కోట్లకు చేరింది. ఈ స్టేడియం నిర్వహణ ఛత్తీస్‌గఢ్ ప్రజా పనుల శాఖకు అప్పగించగా.. మిగిలిన ఖర్చులను క్రీడా శాఖ భరిస్తున్నది. విద్యుత్ బకాయిలకు సంబంధించి పలుమార్లు నోటీసులు పంపినా.. స్పందనలేకపోవడంతో ఐదేండ్ల క్రితమే విద్యుత్ అధికారులు మైదానానికి కెరెంట్ సరఫరా నిలిపివేశారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు స్టేడియంలో తాత్కాలిక కనెక్షన్ ఏర్పాటు చేశారు. అయితే దీని ద్వారా వచ్చే కరెంట్‌తో కేవలం స్టేడియంలోని గదులు, ఇతర ప్రాంతాల్లో మాత్రం వెలుగులు నింపగలగడంతో ఫ్లడ్ లైట్ల కోసం ప్రత్యేకంగా జనరేటర్లు ఉపయోగించారు. ఈ మ్యాచ్ కంటే ముందు ఇక్కడ జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌లకు కూడా ఇదే పద్ధతిని అవలంభించమని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

భరత్‌కు భారత్-'ఎ' బాధ్యతలు

దక్షిణాఫ్రికా షాడో టూర్‌కు జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: తెలుగు ఆటగాడు కోన శ్రీకర్ భరత్ దక్షిణాఫ్రికా పర్యటనకు భారత 'ఎ' జట్టు సారథిగా ఎంపికయ్యాడు. ఈ నెల 10 నుంచి దక్షిణాఫ్రికాలో పర్యటించనున్న టీమిండియా టీ20, వన్డే, టెస్టు సిరీస్‌లు ఆడనుంది. అదే సమయంలో యువ ఆటగాళ్లతో కూడిన భారత-'ఎ' జట్టు కూడా దక్షిణాఫ్రికాలో పర్యటించనుంది. టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందు ఈ యువ జట్టు రెండు అనధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ బరిలోకి దిగిన భారత జట్టులో సభ్యుడైన శ్రీకర్ భరత్‌ను దక్షిణాఫ్రికా టూర్‌కు ఎంపిక చేయకపోగా.. ఇప్పుడు 'ఎ' జట్టు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. సఫారీ గడ్డపై సుదీర్ఘ ఫార్మాట్‌లో ఉన్న చెత్త రికార్డును తిరగరాయలని భావిస్తున్న బీసీసీఐ.. ఆ దిశగా రెండు మ్యాచ్‌ల కోసం రెండు వేర్వేరు జట్లను ప్రకటించింది. దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లకు ఇందులో అవకాశం కల్పించింది. భరత్‌తో పాటు సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, ధ్రువ్ జురేల్, మానవ్ సుతార్, విద్వత్ కవెరప్ప, దేవదత్ పడిక్కల్, సర్ఫరాజ్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, తుషార్ దేశ్‌పాండేకు చోటు దక్కింది. తెలంగాణ కుర్రాడు తిలక్ వర్మ, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నవ్‌దీప్ సైనీని రెండో అనధికారిక టెస్టు ఆడే జట్టులో చోటు కల్పించారు. ఈ రెండు మ్యాచ్‌ల కంటే ముందు నిర్వహించనున్న ఇంటర్ స్క్వాడ్ మూడు రోజుల మ్యాచ్ కోసం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని ఎంపిక చేసింది. సఫారీ టూర్‌లోని పరిమిత ఓవర్ల సిరీస్‌ల నుంచి ఈ ఇద్దరూ విశ్రాంతి కోరగా.. బోర్డు అందుకు అంగీకారం తెలిపిన విషయం తెలిసిందే. ఇక భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఈ నెల 26 నుంచి బాక్సింగ్ డే టెస్టు ప్రారంభం కానుండగా.. 20 నుంచి 22 వరకు జరుగనున్న మూడు రోజుల పోరు వరకు రోహిత్, కోహ్లీ జట్టుతో చేరనున్నారు.

సెమీస్‌లో ప్రియాన్ష

అశ్విని-తనీషా జంట కూడా • సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీ

లక్నో: భారత యువ షట్లర్ ప్రియాన్ష్ రజావత్ సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో శుక్రవారం 21 ఏండ్ల ప్రియాన్ష్ 21-15, 21-16తో ఫర్హాన్ (ఇండోనేషియా)పై విజయం సాధించాడు. ఈ సీజన్‌లో ఒర్లీన్స్ మాస్టర్స్ సూపర్ టైటిల్ నెగ్గి జోరు మీద ఉన్న ప్రియాన్ష్ లక్నోలోనూ అదే జోరు కొనసాగించాడు. 49 నిమిషాల్లో ముగిసిన క్వార్టర్స్‌లో ప్రియాన్ష్ వరుస గేమ్‌ల్లో రెచ్చిపోగా.. మరోవైపు ప్రపంచ జూనియర్ చాంపియన్ ఫర్హాన్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. శనివారం జరగనున్న సెమీఫైనల్లో చీ యూ జెన్ (చైనీస్ తైపీ)తో ప్రియాన్ష్ తలపడనున్నాడు. మరోవైపు మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. క్వార్టర్స్‌లో పొన్నప్ప-తనీషా జంట 21-19, 21-8తో భారతకే చెందిన పుల్లెల గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీ ద్వయంపై విజయం సాధించింది. ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు టైటిల్స్ గెలిచి ఊపులో ఉన్న పొన్నప్ప జంట.. ఫేవరెట్ అనుకున్న గాయత్రి గోపీచంద్ జోడీని వరుస గేమ్‌ల్లో మట్టికరిపించడం గమనార్హం.

తన్మయ్ సెంచరీ వృథా

- **హైదరాబాద్‌కు మూడో ఓటమి**
- **విజయ్ హజారే వన్డే టోర్నీ**

జైపూర్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ జట్టు వరుసగా మూడో పరాజయం మూటగట్టుకుంది. శుక్రవారం మహారాష్ట్రతో జరిగిన పోరులో హైదరాబాద్ 3 వికెట్ల తేడాతో ఓడింది. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (103; 9 ఫోర్లు, ఒక సిక్సర్) శతకంతో కదం తొక్కగా.. కెప్టెన్ రాహుల్ సింగ్ (69), రాహుల్ బుద్ధి (58 నాటౌట్), రవితేజ (33 బంతుల్లో 51 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్‌సెంచరీలతో సత్తాచాటారు. అనంతరం లక్ష్యఛేదనలో మహారాష్ట్ర 49.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 316 పరుగులు చేసింది. అంకిత్ (113), అజీమ్ కాజీ (8) రాణించారు. మన బౌలర్లలో కార్తికేయ 5 వికెట్లు పడగొట్టినా ఫలితం లేకపోయింది.

టీ20ల్లోకి సైకా ఇషాక్

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు భారత మహిళల జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో టీ20, టెస్టుల కోసం భారత మహిళల క్రికెట్ జట్టును శుక్రవారం సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో రాణించిన యువ స్పిన్నర్ సైకా ఇషాక్ తొలిసారి భారత టీ20 జట్టులో చోటు దక్కించుకుంది. సీనియర్లకు తోడు జూనియర్ల మేళవింపుతో టీమ్‌ఇండియా సమతూకంగా కనిపిస్తున్నది. ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఈ నెల 6 నుంచి మొదలుకానుంది. మరోవైపు వన్డేల్లో నిలకడగా రాణిస్తున్న కర్ణాటక లెఫ్ట్‌హ్యాండర్ శుభా సతీష్‌ను టెస్టు జట్టులోకి తీసుకున్నారు. జట్టుకు హర్మన్‌ప్రీత్‌కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

మూడు వికెట్ల దూరంలో..

- **విజయానికి చేరువైన బంగ్లా**
- **న్యూజిలాండ్‌తో తొలి టెస్టు**

ఢాకా: సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న బంగ్లాదేశ్.. న్యూజిలాండ్‌పై భారీ విజయానికి చేరువైంది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ మంచి బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన బంగ్లా.. న్యూజిలాండ్ ముందు 332 పరుగుల లక్ష్యాన్ని నిలపగా.. శుక్రవారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 7 వికెట్ల నష్టానికి 113 పరుగులతో నిలిచింది. చేతిలో 3 వికెట్లు ఉన్న బ్లాక్‌క్యాప్స్ ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే ఇంకా 219 పరుగులు చేయాల్సి ఉంది. డారిల్ మిషెల్ (44 బ్యాటింగ్) ఒంటరి పోరాటం చేస్తుండగా.. లాథమ్ (0), విలియమ్సన్ (11), కాన్వే (22), నికోల్స్ (2), బ్లండెల్ (6), ఫిలిప్స్ (12), జెమీసన్ (9) విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 4 వికెట్లు పడగొట్టాడు. అంతకముందు ఓవర్‌నైట్ స్కోరు 212/3తో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా చివరకు 338 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ నజ్ముల్ హసన్ (105) సెంచరీ చేయగా.. ముష్ఫికర్ రహీమ్ (67), మెహదీ హసన్ (50) అర్ధశతకాలతో రాణించారు.

తైజుల్ ఇస్లామ్ (4/40)

ఆసీస్ స్టార్లకు గిరాకీ

ఈ నెల 19న ఐపీఎల్ వేలం

న్యూఢిల్లీ: రానున్న ఐపీఎల్ వేలంలో ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్లు ట్రావిస్ హెడ్, ప్యాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్ మంచి ధర పలికే అవకాశముంది. ఇటీవలే ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో ఆసీస్ ఆరోసారి టైటిల్ గెలువడంలో వీరు కీలకంగా వ్యవహరించారు. దుబాయ్ వేదికగా ఈ నెల 19న జరిగే వేలంలో ఈ ఆసీస్ త్రయం 2 కోట్ల కనీస ధరతో వేలంలోకి ప్రవేశిస్తున్నారు. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో కథనం ప్రకారం వేలం కోసం మొత్తం 1166 మంది ప్లేయర్లు దరఖాస్తు చేసుకున్నారు. పది ఫ్రాంచైజీల్లో 77 ఖాళీలు ఉండగా, ఇందుకోసం 262.95 కోట్లు ఖర్చు చేయనున్నాయి. మెగాటోర్నీలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్ర 50 లక్షల కనీస ధరతో వేలంలో పాల్గొంటున్నాడు.

అప్పటి వరకు రోహితే కెప్టెన్: గంగూలీ

కోల్‌కతా: వచ్చే ఏడాది జరుగనున్న టీ20 ప్రపంచకప్ వరకు రోహిత్ శర్మనే భారత సారథిగా కొనసాగాలని బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఆకాంక్షించాడు. నిరుడు ఆస్ట్రేలియా వేదికగా జరిగిన పొట్టి ప్రపంచకప్ తర్వాత నుంచి హిట్‌మ్యాన్ రోహిత్‌తో పాటు.. సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఈ ఫార్మాట్‌లో జాతీయ జట్టు తరపున ఆడటం లేదు. తాజాగా దక్షిణాఫ్రికా పర్యటనలో సైతం పరిమిత ఓవర్ల సిరీస్‌ల నుంచి ఈ ఇద్దరు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రోహిత్ ఇక వైట్‌బాల్ క్రికెట్ కెప్టెన్సీకి దూరమైనట్లే అని ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో దాదా ఈ వ్యాఖ్య చేశాడు. 'రోహిత్ సమర్థమైన నాయకుడు. అతడి నైపుణ్యం ఏంటో ప్రపంచకప్‌లో అందరూ చూశారు. మూడు ఫార్మాట్లు ఆడితే అన్నింట్లోనూ అతడే భారత సారథి' అని గంగూలీ వెల్లడించాడు. ఇక రహానే, పుజారాను దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపిక చేయకపోవడంపై కూడా దాదా స్పందించాడు. యువ ఆటగాళ్లకు అవకాశమిచ్చే సమయం ఆసన్నమైందని అన్నాడు. వన్డే ప్రపంచకప్ ఫైనల్ పరాజయం తనను తీవ్రంగా బాధించిందని దాదా పేర్కొన్నాడు.

శివ, అమిత్ పసిడి పంచ్

షిల్లాంగ్: జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ బాక్సర్లు శివ తాపా, అమిత్ పంగల్ పసిడి పతకాలతో మెరిశారు. శుక్రవారం జరిగిన పురుషుల 51కిలోల ఫైనల్ బౌట్‌లో అమిత్ 5-0తో అన్షుల్ పునియాపై అలవోక విజయం సాధించాడు. ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియాగేమ్స్‌కు దూరమైన అమిత్...జాతీయ టోర్నీలో సత్తాచాటాడు. ఆది నుంచే తనదైన దూకుడు కొనసాగించిన అమిత్..ప్రత్యర్థిపై పదునైన పంచ్‌లతో విరుచుకుపడ్డాడు. పవర్‌ఫుల్ పంచ్‌లకు తోడు జాబ్స్, హుక్స్‌తో చెలరేగిన పంగల్ కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. జాతీయ టోర్నీలో పసిడి ద్వారా రానున్న పారిస్ (2024) ఒలింపిక్స్‌కు బెర్తు దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. మరోవైపు ఆరుసార్లు ఆసియా చాంపియన్ శివ తాపా..వంశజ్‌పై ఏకపక్ష విజయం సాధించాడు. శివ సంధించిన పంచ్‌లకు వంశజ్ నుంచి సరైన సమాధానం లేకపోయింది. సచిన్ సివాచ్(57కి), లక్ష్యయ్ చాహర్(80కి), సంజీత్(92కి) టైటిళ్లు దక్కించుకున్నారు.

కబడ్డీ..కబడ్డీ

నేటి నుంచి ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్

తెలుగు టైటాన్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య తొలి పోరు

న్యూఢిల్లీ: కబడ్డీ ఆటకు వేళయైంది. గ్రామీణ క్రీడకు కార్పొరేట్ హంగులు అద్దుదుతూ అభిమానులను అలరిస్తున్న కబడ్డీ మరోమారు సిద్ధమైంది. ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) పదో సీజన్‌కు శనివారం తెరలేవనుంది. తెలుగు టైటాన్స్, గుజరాత్ జెయింట్స్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. గత సీజన్లను మరిపిస్తూ ఈసారి దుమ్మురేపాలన్న పట్టుదలతో టైటాన్స్ బరిలోకి దిగుతున్నది. 2014లో మొదలైన పీకేఎల్ 30 సెకన్ల రైడ్, డూ ఆర్ డై రైడ్స్, సూపర్ రైడ్స్, సూపర్ ట్యాకిల్ లాంటి వినూత్న నియమాలను అమలు చేసి అభిమానులకు మరింత చేరువైంది. ఈ కారణంగా దేశంలో క్రికెట్ తర్వాత అత్యధిక జనాదరణ కల్గిన లీగ్‌గా కబడ్డీ రికార్డుల్లోకెక్కింది. లీగ్ పదో సీజన్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా శుక్రవారం అహ్మదాబాద్‌లోని అక్షర్ రివర్‌క్రూజ్‌లో వివిధ ఫ్రాంచైజీ కెప్టెన్లతో కలిసి లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి ట్రోఫీని ఆవిష్కరించారు. రైడింగ్‌లో తనకంటూ ప్రత్యేకతను దక్కించుకున్న పవన్ షెరావత్ ఈసారి కెప్టెన్‌గా వ్యవహరించడం టైటాన్స్‌కు బాగా కలిసిరానుంది. ఈ సందర్భంగా పవన్ మీడియాతో మాట్లాడుతూ 'తమ తొలి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో తలపడబోతున్నాం. మ్యాట్‌పై అడుగుపెట్టేందుకు ఎప్పుడెప్పుడా ఆతృతగా ఎదురుచూస్తున్నా. గత సీజన్‌కు దూరంగా ఉండటం నిరాశ కల్గించింది. మొదటి మ్యాచ్‌లో ఫజల్ అత్రాచలి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను. కోచింగ్ క్యాంప్‌లో ప్లేయర్లందరూ మెరుగైన శిక్షణ పొందారు' అని అన్నాడు. పీకేఎల్ అహ్మదాబాద్ అంచె ఈ నెల 7వరకు జరుగనుండగా, జనవరి 19 నుంచి 24 వరకు జరిగే మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. పీకేఎల్ స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.